క్లుప్తంగా

నేడు బాబా ఆలయ వార్షికోత్సవం

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ మహాదేవపురంలోని షిర్డీ సాయిబాబా ఆలయ 11వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, ఋత్వికరణం, దీక్షాధారణ, రక్షాబంధనం, మండపారాధన, లక్ష్మి గణపతిహవనము, నవగ్రహవనము తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలియజేసింది.

శుభాకాంక్షలు



కో.ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీంకు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్లు

నిజాంపేట్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన కార్పొరేటర్లు శనివారం బాచుపల్లికి చెందిన కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక బహుమతి అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వీరేందర్‌రెడ్డి, సురేష్ రెడ్డి, బాలాజీ నాయక్, రాజశేఖర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జగన్‌యాదవ్, స్వామి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ



ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్ లోని సర్వే నెంబర్ 307 వద్ద ఇరు వర్గాలు పరస్పర దాడులకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలులోకి వచ్చింది. స్థానికంగా వడ్డెర కులస్తులు గత కొంతకాలంగా నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. తాజాగా ఒక వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు సదరు స్థలం తమకు నవాబులు ఇచ్చారని దానిపై కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకున్నామంటూ శుక్రవారం మధ్యాహ్నం బోర్డులు పాతారు. దీంతో ఇరు వర్గాల మధ్య మాట పెరిగి దాడులకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న జగద్గిరిగుట్ట పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పలువురిని పోలీస్ స్టేషన్ తరలించారు. ఈఇరు వర్గాలు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

ఈద్గా ప్రారంభం



ఈద్గాను ప్రారంభించి మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీలోని ఈద్గాను హోంమంత్రి మహమూద్ అలీ, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి శనివారం ప్రారంభించారు. రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రభుత్వం అన్ని పండుగలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ముస్లింలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అండగా ఉంటూ ఈద్గాను నిర్మించి ఇవ్వటం అభినందనీయమని కొనియాడారు. ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ నగరంలో ఎక్కడా లేని విధంగా ముస్లింలకు కేపీహెచ్‌బీలో ఈద్గా నిర్మించామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో అన్నికులాలు, మతాలు సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు.కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు గౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్ బాబూరావు, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను శనివారం బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష బాబూరావు ప్రారంభించారు. రెయిన్‌బోవిస్టాస్ వద్ద సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంజనేయనగర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలన్నారు. మధుసూదన్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, అనిల్, హనుమంత్‌రావు, కృష్ణంరాజు, ప్రకృతి రఘు, నవాజ్, జోగారావు, తదితరులు పాల్గొన్నారు.



చింతల్‌లో జరిగిన రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంభీపూర్‌రాజు, కార్పొరేటర్లు..



మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగిన రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్..

భక్తి శ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్

రంజాన్ పండుగను శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక మున్సిపల్ గ్రౌండ్, మల్లంపేట్, బాచుపల్లి, జగద్గిరిగుట్ట, షాపూర్‌నగర్, కొంపల్లి తదితర ప్రాంతాల్లోని ఈద్గాల్లో ముస్లింలు పెద్ద ఎత్తున హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేసి విందు ఏర్పాటు చేశారు. –కుత్బుల్లాపూర్



నిజాంపేట్‌లో ..



బాచుపల్లిలో..



మల్లంపేట్‌లోని ఈద్గాలో..



మల్లంపేట్‌లో..



శుభాకాంక్షలు తెలుపుతున్న కె.ఎం.ప్రతాప్

ఫుట్‌పాత్‌లే పార్కింగ్ అడ్డాలు

రంగారెడ్డినగర్: వాణిజ్య సముదాయాల్లో పార్కింగ్‌కు స్థలం కేటాయించకపోవడంతో వాహనదారులు ఫుట్‌పాత్‌లపై వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో పాదచారుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేస్తున్న ఫుట్‌పాత్‌లు నిరుపయోగంగా మారుతున్నాయి.. రంగారెడ్డినగర్ డివిజన్, ఏపీహెచ్‌బీ కాలనీలోని కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయం రోడ్డుపై ఉన్న ఫుట్‌పాత్ వాహనదారులకు వరంగా మారుతోంది. సమీపంలోని ఆస్పత్రులు, బ్యాంక్‌లు, ఇతర దుకాణాలకు వచ్చే వాహనదారులు చెట్టు నీడన ఫుట్‌పాత్‌లపై వాహనాలను నిలుపుతున్నారు. దీంతో పాదచారులు నడిచేందుకు వీలు లేకుండా పోతోంది. పాదచారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఫుట్ పాత్‌లపై పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఫుట్‌పాత్‌పై బైక్‌లను పార్క్ చేసిన దృశ్యం

పైప్‌లైన్ల ఆధునికీకరణకు చర్యలు



వాటర్‌వర్క్స్ జీఎంను కలిసిన స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ అసోసియేషన్ సభ్యులు

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ జలమండలి డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ వ్యవస్థలను ఆధునికీకరిస్తున్నామని జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డి తెలిపారు. స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీలోని భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అధునికీకరణ, విస్తరణకు జలమండలి నుంచి నిధులు మంజూరైన నేపథ్యంలో శనివారం కాలనీ అసోసియేషన్ సభ్యులు ఏపీహెచ్‌బీ కాలనీలోని వాటర్ వర్క్స్ కార్యాలయంలో జీఎం శ్రీధర్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే పనులు ప్రారంభించి స్థానికంగా డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జీఎంను కలిసిన వారిలో స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ ఉపాధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, కాలనీ సెక్రటరీ వరప్రసాద్, సీనియర్ కాలనీ మెంబర్ సురేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ

నిజాంపేట్: రంజాన్ పండుగను పురస్కరించుకుని శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, సాయినగర్‌లో కాలుష్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పేద ముస్లిం మహిళలకు నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు దాసి నాగరాజు మాట్లాడుతూ పేదలకు పండుగ కానుకలు ఇవ్వడంతో పాటు మానవవత్వాన్ని మేల్కొలిపేందుకు కారుణ్య వెల్ఫేర్ సొసైటీ కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి సైదులు, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ కానుకలు అందజేస్తున్న దాసి నాగరాజు

మెరుగైన వసతుల కల్పనకు కృషి

నిజాంపేట్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎస్‌జేబీ హిల్స్ కాలనీలో నూతనంగా సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఆయనను శాలువతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వీరేందర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థలను ఆధునికీకరిస్తున్నామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కృష్ణారావు, కేవీరావు, సుబ్బారా, చందురెడ్డి, శ్రీధర్ రెడ్డి, శివరామకృష్ణ, రాజశేఖర్, ప్రవీణ్, నాగరాజు, వెంకట్, రాంబాబు, సుధీర్, సురేష్, హర్ష,రవికాంత్, సుధాకర్, శ్రీనివాస్, రామలక్ష్మి, త్రిపుర, లత తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌జేబీ హిల్స్‌లో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వీరేందర్‌రెడ్డి

పేరుకే హోల్‌సేల్

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హోల్‌సెల్ మార్కెట్‌లో రిటైల్ అమ్మకాలు...
- చోద్యం చూస్తున్న అధికారులు...

ఓల్డ్ బోయిన్‌పల్లి: బోయిన్‌పల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హోల్‌సెల్ కూరగాయల మార్కెట్‌లో నిబంధనలకు విరుద్ధంగా కమీషన్ ఏజెంట్లు రిటైల్‌గా కూరగాయలు విక్రయిస్తున్నా మార్కెట్ అధికారులు పట్టించుకోవడం లేదని రిటైల్ కూరగాయల మార్కెట్ అధ్యక్షుడు మక్కాల అశోక్ ఆరోపించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇటీవలి కాలంలో మార్కెట్ అధికారుల అండదండలతో కమీషన్ ఏజెంట్లు రిటైల్ వ్యాపారాలు చేస్తుండటంతో చిల్లర వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. శనివారం ఉదయం హోల్‌సెల్ కూరగాయల మార్కెట్‌లో రిటైల్‌గా ఆకు కూరగాయల వ్యాపారం జరుగుతున్నట్లు తెలియడంతో ఆయన రిటైల్ వ్యాపారులతో కలిసి మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్ దృష్టికి తెచ్చారు. మాదన్నపేట మార్కెట్‌లో విక్రయించాల్సిన ఆకు కూరలను బోయిన్‌పల్లి మార్కెట్‌లో అమ్ముతున్నారని వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సెక్రెటరీ తెలిపారన్నారు. గతంలోనూ పలుమార్లు ఆధారాలతో సహా మార్కెట్ సెక్రటరీ దృష్టికి తెచ్చినా రిటైల్ అమ్మకాలు నిలిచిపోలేదని, దీంతో రిటైల్ వ్యాపారులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హోల్‌సెల్ మార్కెట్‌లో రిటైల్ వ్యాపారాలు కొనసాగితే మార్కెట్ ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



రిటైల్‌గా ఆకు కూరలు అమ్ముతున్న దృశ్యం

కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్

కుషాయిగూడ: కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్‌గా బి. ప్రవీణ్‌కుమార్‌ను నియమిస్తూ రాచకొండ సీపీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లును స్పెషల్‌బ్రాంచ్‌కు బదిలీ చేయగా స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్‌ను కుషాయిగూడ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేశారు. అలాగే కుషాయిగూడ డిఐగా విధులు నిర్వహిస్తున్న పి.గురువారెడ్డిని స్పెషల్‌బ్రాంచ్‌కు బదిలీ చేయగా అతడి స్థానంలో ఎవరినీ నియమించలేదు. ప్రవీణ్‌కుమార్ సోమవారం కుషాయిగూడ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

అనురాగ్ యూనివర్సిటీలో ఘనంగా ఎర్త్ డే



ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో శనివారం ఎర్త్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో పోస్టర్ తయారీ, ప్రదర్శన, భూరక్షణ ర్యాలీ నిర్వహించారు. యూనివర్సిటీ సమీపంలోని చెరువు పరిసరాలను శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని నివారించడంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీటీఓ డాక్టర్ మల్లేశ్, 50 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు

కూకట్‌పల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని సురేష్ అన్నారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా వికాస తరంగిణి ఆధ్వర్యంలో సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులు శనివారం 'మొక్కలను రక్షించు.. వేసవి వేడిని తగ్గించు' నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సురేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజు నాడు మొక్కనాటి కాపాడాలన్నారు. తరంగిణి పీఆర్ఓ యోగేష్ ప్రభు మాట్లాడుతూ అందరు స్వదేశీ వస్తువులు వాడాలని దేశ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాధవరం కాంతారావు, డాక్టర్ శ్రీనాథ్, వికాస్ తరంగిని అధ్యక్షుడు శ్రవణ్, హరిబాబు, నాగేశ్వర్‌రావు, కృష్ణంరాజు, విఠల్, వైకుంఠం, కళావతి, శశికుమార్, కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా మల్లేష్



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి అడ్వకేట్ బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షులుగా రాష్ట్ర బీసీ నాయకులు మల్లేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఆయనను తెలంగాణ బీసీ వికాస్ సమితి అధ్యక్షుడు బాశెట్టి నర్సింగ్‌రావు, బీసీ సంఘాల నేతలు కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు గున్నాల వినోద్, పద్మయ్య, అడ్వకేట్ కేశవరావు, వడ్ల వెంకటేష్, గోవర్ధన్, పండిత్రావ్,మేడ్చల్ జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు తేళ్ల హరికృష్ణ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



నిస్సి (ఫైల్)

జీడిమెట్ల: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ ప రిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథ నం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సంజయ్‌పాండే, నిస్సి దంపతులు పదేళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చి సూరారం డివిజన్ సంజయ్‌గాంధీ నగర్‌లో ఉంటున్నారు. ఈ నెల 14న సంజయ్‌పాండే నైట్ డ్యూటీకి వెళ్లగా ఇంట్లో నిస్సీ ఆమె ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాత్రి కుమారుడు నిద్ర లేచి చూడగా తల్లి కనిపించకపోవడంతో తండ్రికి సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించినా ఆచూకీ తెలియరాలేదు. ఆమె భర్త సంజయ్ ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చూసుకుని వెళ్లండి..

అటెన్షన్ ప్లీజ్



జీడిమెట్ల: గాజులరామారం డివిజన్ చంద్రగిరినగర్‌లోని ప్రధాన రహదారిపై భూగర్భ డ్రైనేజీ మూత ధ్వంసమైనా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని మ్యాన్‌హోల్‌పై మూతను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో నైట్ క్యాంప్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని అక్షర ఇంటర్నేషనల్ బ్రాంచ్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ హైమావతి ఆధ్వర్యంలో శనివారం నైట్ క్యాంప్ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్యకర వాతావరణం అందించడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కుండల తయారీ, బెలూన్ షూటింగ్, జార్బింగ్, రోటేట్‌బౌన్సీ, పిక్ ది కోన్ తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. ఆటపాటలతో విద్యార్థినీ విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అక్షర పాఠశాల సీఈఓ మదనమోహన్‌రావు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడపాలన్నారు. తెల్లవారుజామున జుంబా, యోగా తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

SLG™ HOSPITALS
Multi-Superspecialty, Affordable Tertiary Care Centre
ఏమండోయ్! ఇది విన్నారా?
నాణ్యమైన వైద్య పరీక్షలు సరసమైన ధరలకే...
24 ఏప్రిల్ నుండి 15 మే వరకు మాత్రమే

కిడ్నీ స్టోన్ ప్యాకేజీ
- సి.యూ.ఈ
- సి.బి.పి
- ఆర్.ఎఫ్.టి
- యూ.ఎస్.జి - కే.యూ.బి
- ఎక్స్-రే - కే.యూ.బి
- యూరాలజిస్ట్ కన్సల్టేషన్
~~4720/-~~ 1100/-
ప్రోస్టేట్ ప్యాకేజీ
- సి.యూ.ఈ
- సీరం పి.ఎస్.ఎ
- యూ.ఎస్.జి + కే.యూ.బి
- యూ.ఎస్.జి + పి.వి.ఆర్.యూ
- యూరోఫ్లోమెట్రీ
- యూరాలజిస్ట్ కన్సల్టేషన్
~~4090/-~~ 999/-
తదుపరి ప్రక్రియలపై అదనంగా 20% శాతం తగ్గింపు
ఎమర్జెన్సీ 7799235678
ఎస్.ఎల్.జి సర్కిల్, నెం-306, నిజాంపేట్ రోడ్, బాచుపల్లి, హైదరాబాద్, తెలంగాణ - 500 090
Contact : 040 2378 5678 www.slghospitals.com / slghospitals

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029